సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



సోమేశ్వరుడి సన్నిధిలో..

భీమవరం(ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి శనివారం సందర్శించారు.



స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

బుట్టాయిగూడెం వద్ద స్కూల్ బస్సును లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. విద్యార్థులకు ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

8లో ▸

వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరులోని వరాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



న్యూస్‌రీల్

వీఆర్వోలకు పదోన్నతులపై హర్షం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

భీమవరం: జిల్లాలోని పలువురు వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించడం హర్షణీయమని వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో సంఘం నాయకులు కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 21 మంది వీఆర్వోలకు పదోన్నతలు కల్పించగా వారిలో 9 మందిని పశ్చిమగోదావరి జిల్లాకు సీనియర్ అసిస్టెంట్లుగా కేటాయించారన్నారు. ఇటీవల ఓటర్ల జాబితాలో చిన్నపాటి తప్పుల కారణంగా వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కెనడి, రత్నరాజు, నాగమణి, వల్లి, రామారావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

12న పోలీసు స్పందన

భీమవరం: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం భీమవరంలో నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని ఈనెల 12న నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జిల్లా పోలీసు కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నరసాపురంలో ఏర్పాటుచేశామన్నారు.

గేట్ తుది విడత పరీక్షలు



పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఐఐటీ, ఎన్‌ఐటీల్లో పీజీ ప్రవేశాలకు గాను దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ప్రవేశ పరీక్ష తుది విడత శనివారం ప్రారంభమైంది. పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా పరీక్ష నిర్వహించారు. ఉదయం 196 మందికి 183 మంది, సాయంత్రం 150 మందికి 130 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు, పరీక్షా కేంద్రం కో–ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి వచ్చిన పరిశీలకులు పర్యవేక్షించారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వన్‌స్టాప్ సెంటర్ నరసాపురంలో కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి.సుజాతరాణి తెలిపారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్–1 పోస్ట్, కేసు వర్కర్–2 పోస్టులు, పారా లీగల్ పర్సనల్ /లాయర్–1 పోస్టు, పారా మెడికల్ పర్సనల్–1 పోస్టు, సైకో–సోషల్ కౌన్సిలర్–1 పోస్ట్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఆఫీస్ అసిస్టెంట్–1 పోస్ట్, మల్టీపర్పస్ స్టాఫ్‌కుక్–1 పోస్టు, సెక్యూరిటీ గార్డ్/ నైట్ గార్డ్–3 పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. అభ్యర్థులు westgodavari.ap.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడు చేసుకుని పూర్తిచేసి అన్ని ధ్రువీకరణ పత్రాల నకళ్లు అటెస్టేషన్ చేయించి భీమవరంలోని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయము, డోర్ నం.202, కలెక్టరేట్ కాంపౌండ్ కార్యాలయంలో ఈనెల 17న సాయంత్రం 5 గంటలోపు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు భరోసా

- ముమ్మరంగా పంట నమోదు
- జిల్లాలో 2,24,395 ఎకరాల్లో రబీ సాగు
- 1,78,420 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు
- ఈనెల 15 వరకు గడువు



పొలం వద్ద ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

సాక్షి, భీమవరం: అక్రమాలకు తావులేకుండా సాగుదారులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చేందుకు చేపట్టిన ఈ-క్రాప్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంట నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 80 శాతం పూర్తి కాగా నిర్ణీత గడువునాటికి నూరు శాతం పూర్తి చేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలు, దళారుల జోక్యానికి బ్రేక్ వేసి కనీస మద్దతు ధర అందించడం ద్వారా సీఎం జగన్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. ఆయా పథకాల అమలులో పారదర్శకత కోసం ఈ-క్రాప్ ద్వారా ఏటా పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తోంది. పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ-పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలను మూటకట్టుకోవాల్సి వచ్చిన సందర్భంలో వారికి ఈ-క్రాప్ కొండంత అండగా నిలుస్తోంది. ప్రస్తుతం ఈ-పంట నమోదులో వ్యవసాయ సిబ్బంది నిమగ్నమయ్యారు. సాగుభూమి విస్తీర్ణం ఎంత? ఎవరు సాగు చేస్తున్నారు? ఏ పంటలను పండిస్తున్నారనే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

15 నాటికి పూర్తిచేసేందుకు..

జిల్లాలో 2,53,193 ఎకరాల రబీ ఆయకట్టుకు గాను 2,49,549 ఎకరాల్లో వరి, 708 ఎకరాల్లో మొక్కజొన్న, 1,526 ఎకరాల్లో మినుములు, 720 ఎకరాల్లో వేరుశనగ, 690 ఎకరాల్లో చెరకు సాగవుతాయి. ఇప్పటివరకు 2,23,836 ఎకరాల్లో రైతులు రబీ నాట్లు వేశారు. గ్రామస్థాయిలో వ్యవసాయ సిబ్బంది పొలాల్లోకి రైతులతో పంట నమోదు చేయిస్తున్నారు. ఈనెల 15 వరకు ఈ-క్రాప్ నమోదుకు గడువుండగా ఇప్పటివరకు 80 శాతం పూర్తయ్యింది. 96,019 మంది రైతులకు సంబంధించి 1,78,420 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంట నమోదు చేయించుకున్నారు. గణపవరం, పాలకోడేరు మండలాల్లో నూరుశాతం పూర్తి కాగా తణుకు, పెంటపాడు, ఆకివీడు, ఉండి, కాళ్ల, భీమవరం, యలమంచిలి మండలాల్లో 85 శాతానికి పైబడి నమోదు పూర్తయ్యింది. నిర్ణీత గడువు నాటికి నూరు శాతం పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ-క్రాప్ ప్రయోజనాలు

- ప్రకృతి వైపరీత్యాలతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు త్వరితగతిన పూర్తి నష్టం వివరాలు లెక్కించేందుకు, సాగుచేసిన రైతులకు మాత్రమే పరిహారం అందించేందుకు ఈ-క్రాప్ నమోదు ఉపకరిస్తుంది.
- గ్రామ, మండల స్థాయిలో సాగు విస్తీర్ణం, ఏ రకమైన పంటలు సాగు చేశారు, వాటి దిగుబడులకు సంబంధించి స్పష్టమైన సమాచారం తెలుసుకునే వీలుంటుంది.
- వర్షాభావం/అధిక వర్షాలు వంటి పరిస్థితుల్లో ఏయే పంటలు నష్టపోయారు. ఎంత విస్తీర్ణం, ఎంత మంది రైతులు అనే వివరాలు తెలుస్తాయి.
- పంట దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేసేటప్పుడు ఎటువంటి సమస్యా లేకుండా పంట సాగు ధ్రువీకరణ పత్రం పొందేందుకు వీలుంటుంది.

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	ఈ క్రాప్ నమోదైన ఎకరాలు
అత్తిలి	7,553	14,114	11,187
ఆకివీడు	1,947	5,000	4,264
ఆచంట	3,390	10,390	6,002
ఇరగవరం	5,517	13,441	10,135
ఉండి	3,807	10,933	9,212
కాళ్ల	1,847	4,342	3,839
గణపవరం	6,441	11,545	11,545
తణుకు	6,617	11,318	10,233
తాడేపల్లిగూడెం	10,521	25,275	20,799
నరసాపురం	3,159	9,142	5,786
పాలకొల్లు	4,271	10,073	7,146
పాలకోడేరు	4,858	11,402	11,345
పెనుగొండ	4,192	11,793	9,025
పెనుమంట్ర	4,767	12,246	8,177
పెంటపాడు	11,241	21,448	19,408
పోడూరు	3,902	13,091	7,943
భీమవరం	3,175	8,878	7,541
మొగల్తూరు	610	1,198	963
యలమంచిలి	3,319	5,760	4,761
వీరవాసరం	4,905	12,447	9,110

త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు



ఈ-క్రాప్ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. సాగు కాలంలో ప్రభుత్వ పథకాల లబ్ధి అందాలంటే పంట నమోదు తప్పనిసరి. నమోదు ప్రక్రియ జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుల ఫొటోలు తీసుకుని పంట వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పూర్తికాగా ఈనెల 15వ తేదీ నాటికి నూరుశాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కలెక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా పూర్తిచేసేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు భీమవరం కలెక్టరేట్ నుంచి జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆచంట మండలం లంక గ్రామాల్లో ఎన్నికల కోసం బోట్లు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 1,461 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎన్నికల బందోబస్తుకు పోలీసు సిబ్బంది కొరత ఉందని, కేంద్ర బలగాల కోసం లేఖ రాశామన్నారు. అధికారులకు, సిబ్బందికి శిక్షణ తరగతులు పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది, పోలీసు బందోబస్తు, వాహనాల అవసరంపై డేటాను సిద్ధం చేశామన్నారు. ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, ఇన్‌చార్జి డీపీఓ ఎం.నాగలత, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్, ఎన్నికల తహసీల్దార్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ అజిత



ఉండి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

ఉండి: ఉండి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా కొత్త ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉండి పోలీస్టేషన్‌కు మొదటిసారి విచ్చేశారు. జిల్లా పరిధిలోని పోలీస్‌స్టేషన్లు జిల్లా కేంద్రానికి ఎంత దూరంలో ఉన్నాయి, ఎక్కడ ఉన్నాయి అనే విషయాలను గమనిస్తున్నట్టు ఎస్పీ చెప్పారు. అలాగే జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను అరికట్టడంతో పాటుగా జూదం, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులకు ఆదేశించామన్నారు. అలాగే త్వరలో ఎన్నికల జరుగనున్న నేపథ్యంలో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా చూడాలని పోలీసులకు సూచించారు. ఆకివీడు రూరల్ సీఐ కె.సత్యనారాయణ, ఉండి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఉన్నారు.

నరసాపురంలో ఏటిగట్టు కుంగలేదు

- నిర్మాణ సమయంలో అది సహజంగా జరిగే ప్రక్రియ
- ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలించిన అధికారుల బృందం



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్

నరసాపురం: నరసాపురం పట్టణం పొన్నపల్లి వద్ద వశిష్ఠ గోదావరి ఏటిగట్టు పటిష్ఠ పనులు జరుగుతున్న ప్రాంతంలో గట్టు కుంగిందంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని కన్జర్వేన్సీ చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ చెప్పారు. ప్రతిపక్షాల ఆరోపణల్లో నిజం లేదని, గోదావరి పరివాహక ప్రాంతం ప్రజలు భయపడ్సాన పనిలేదన్నారు. శనివారం సతీష్‌కుమార్‌తో పాటు గోదావరి డెల్టా సెక్షన్స్ ప్రభుత్వ సలహాదారు ఎం.గిరిధర్‌రెడ్డి మరికొంతమంది కన్జర్వేన్సీ ఇంజనీర్ల బృందం పొన్నపల్లి గోదావరి ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ 2022 వరదల సమయంలో స్థానికంగా ఏటిగట్టు కోతకు గురికావడంతో ప్రభుత్వం గట్టు పటిష్ఠతకు రూ.26 కోట్లు మంజూరు చేసిందన్నారు. టెండర్ ప్రక్రియ నిర్వహించి పనులు చేపట్టామన్నారు. పనులు జరుగుతున్నప్పుడు నేల స్వభావాన్ని బట్టి వేసిన రాళ్లు జారుతుంటాయని వివరించారు. అలా జారితేనే రాళ్లు నేలలో కుదురుకుని గట్టు పూర్తి పటిష్ఠం అవుతుందన్నారు. పనులు ఇంకా పూర్తికాలేదన్నారు. పని జరుగుతున్నప్పుడు వేసిన రాళ్లు జారుతుంటే గట్టు కుంగిపోతుందని, నాసిరకం రాళ్లు ఉపయోగిస్తున్నారని, అవినీతి జరిగిందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ విమర్శల్లో నిజం లేదన్నారు. పూర్తి నాణ్యతతో పారదర్శకంగా పనులు సాగుతున్నాయని చెప్పారు.

మహిళా సంక్షేమానికి ఆసరా

మహిళల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ వారి సాధికారతకు కృషి చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం తణుకు నియోజకవర్గంలో ఆసరా కార్యక్రమం నిర్వహించారు.

– తణుకు అర్బన్



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు



తణుకులో మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

దమ్మున్న నేత సీఎం జగన్

మీ కుటుంబానికి మంచి జరిగితేనే నాకు ఓటెయ్యమన్న దమ్మున్న ఏకైక నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మహిళా పక్షపాతిగా ప్రతి లబ్ధినీ వారి ఖాతాల్లో నేరుగా జమచేస్తున్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

(తణుకులో శనివారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)

సీఎం జగన్ వెంటే మేమంతా..



సీఎం జగన్ మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచే లక్ష్యంతో పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వారి ఖాతాల్లో జమ చేస్తూ మా గౌరవాన్ని పెంచారు. వైఎస్సార్ ఆసరా పథకంలో నాకు నాలుగు విడతల్లో రూ.47 వేల రుణమాఫీ అందింది. అన్ని పథకాలను మహిళల పేరిట అందించడం చాలా సంతోషం.

– రెల్లి సత్యవతి, తణుకు

ఇచ్చిన మాట ప్రకారం



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు డ్వాక్రా రుణమాఫీ చేశారు. నాలుగు విడతల్లో లబ్ధి మాకు అందించారు. గతంలో రాష్ట్రంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ పేదవర్గాలకు అండగా నిలిచారు. ప్రభుత్వ పథకాలన్నీ నాకు అందుతున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– ఎస్.సత్యకుమారి, తణుకు

క్లుప్తంగా

నేడు వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



వాసవీ కన్యకా పరమేశ్వరి మాత మూలవిరాట్

పెనుగొండ : ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం మూలవిరాట్ వాసవీ మాత వేంచేసి యున్న శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైభవంగా నిర్వహించనున్నారు. తొలుత నగరేశ్వరస్వామికి, వాసవీ కన్యకా పరమేశ్వరి, మహిషాసురమర్దని అమ్మవార్లకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 8 గంటలకు వాసవీ దీక్షధారులతో బజారు రామాలయం నుంచి 102 కలశాలు, వెండి పల్లకీ ఊరేగింపు నిర్వహి స్తారు. అనంతరం వాసవీ మహాయాగం, గణపతి పూజ, వాసవీ పూజ, పూర్ణాహుతితో వాసవీ దీక్ష విరమణ చేస్తారు. రాత్రి నిప్పుల గుండం, అన్నసమారాధన నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

ద్వారకాతిరుమల: కొమ్మరలో విద్యుత్ లైన్ నిర్మాణం కోసం స్తంభం ఎక్కిన ఓ యువకుడు షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ కు చెందిన యువకుడు బ్రోజన్ (22) ఒక కాంట్రాక్టర్ వద్ద విద్యుత్తు లైన్ల నిర్మాణ పనులు చేస్తున్నాడు. కొమ్మరలోని ఒక సెల్‌ఫోన్ టవర్ వద్ద ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చేందుకు బ్రోజన్ స్తంభం ఎక్కాడు. కొమ్మర, రాళ్లకుంట ఫీడర్ల లైన్‌లు ఉండగా, బ్రోజన్ కొమ్మర ఫీడర్‌కు మాత్రమే ఎల్‌సీ తీసుకున్నాడు. అయితే రాళ్లకుంట ఫీడర్ వైర్లను పట్టుకోవడంతో షాక్‌కు గురై స్తంభం పైనే మృతి చెందాడు. భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దింపి పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: రాష్ట్రంలోని అన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్రర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలో రూ.5 కోట్లతో నిర్మించే ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తణుకు మండలం దువ్వ నుంచి తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వరకు 6.30 కిలో మీటర్ల మేర రోడ్డును రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వారం రోజుల్లో నిర్మాణ పనులను ప్రారంభిస్తారన్నారు. ఈ రోడ్డులో ముద్దాపురం గ్రామంలో 1200 మీటర్ల మేర సీసీ రోడ్డుగా, మిగిలిన రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మిస్తారన్నారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పాలనలో గ్రామాల అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో ఆ గ్రామంలోనే సమస్యలు పరిష్కరించేలా పరిపాలనా వ్యవస్థలను రూపొందించారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామంలోని ప్రజల కనీస అవసరాలు తీర్చే విధంగా పరిపాలనా కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ ఎస్.సాంబశివరావు, ఏఈ ఎ.యశ్వంత్, ఎంపీపీ రుద్రధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, సర్పంచ్ మజ్జి పద్మ, ఎంపీటీసీ సభ్యులు కె.కృష్ణవేణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు టీఎస్ సత్యనారాయణ, ఎంపీడీవో డీ శ్రీలలిత, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, కోనాల పాల్గొన్నారు.

భీమవరంలో చెస్ టోర్నీ ప్రారంభం



భీమవరంలో చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్



చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం: విద్య, క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబం చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. శనివారం భీమవరంలో గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ ఏపీ స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ కుటుంబం నియోజకవర్గం అభివృద్ధికే కాకుండా విద్య, క్రీడలు, వైద్యం అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కోట్లాది రూపాయల విలువ చేసే నాలుగు ఎకరాల భూమి, బీవీఆర్ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రూ.40 సెంట్ల స్థలం ఉచితంగా అందించారని కొనియాడారు. మునిసిపల్ చైర్మన్‌గా భీమవరం పట్టణాభివృద్ధికి విశేషమైన కృషి చేసిన దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు (జీవీఆర్) పేరున రాష్ట్రస్థాయి చెస్ పోటీలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గ్రంధి రవితేజ మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, పోటీతత్వం పెరుగుతుందన్నారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తోట భోగయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, కోడె యుగంధర్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, తోట హరిబాబు, మైలాపురి మురళీ, గమిని రవిపవన్ కుమార్, ఎస్.కోటేశ్వరరావు, మాదాసు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని అనివేటి మండపంలో ఓ భక్తుడు గుండెపోటుకు గురై శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆకివీడుకు చెందిన కె.రాంబాబు (40) శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ద్వారకాతిరుమలకు వచ్చారు. దర్శనం అనంతరం అనివేటి మండపంలోకి చేరుకున్న రాంబాబు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడే కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని అంబులెన్స్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు రాంబాబు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం అదే అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

డ్రెయిన్ల ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ ముఖ్య సలహాదారు తిరుపాల్‌రెడ్డి



బొండాడ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న తిరుపాల్‌రెడ్డి

కాళ్ల: మురుగు కాలువల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ ముఖ్య సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి చెప్పారు. జిల్లాలోని భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో శనివారం రైతు కార్యాచరణ సమితి సభ్యులతో కలసి ఆయన పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఈలంపూడి, మాలవానితిప్ప గ్రామాల్లో మురుగు కాల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బొండాడ మురుగుకాలువలో అడ్డుపడుతున్న గుర్రపుడెక్క, కిక్కిస నిర్మూలన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలను అభివృద్ధి చేసి సాగుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు మాట్లాడుతూ తిరుపాల్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మురుగుకాలువల పరిస్థితిని ఆయన దృష్టికి, రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లడంతో మంత్రి రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో మురుగు కాలువల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో మురుగు కాలువల ప్రక్షాళన వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తిరుపాల్‌రెడ్డికి వివరించామన్నారు. రైతు నాయకులు కె.కమలాకర్‌శర్మ, కె.గోపాలకృష్ణరాజు, టీ నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



ఘటనా స్థలంలో విద్యార్థుల తల్లిదండ్రులు

ద్వారకాతిరుమల : బుట్టాయిగూడెం వద్ద హైవేపై శనివారం ఒక లారీ స్కూల్ బస్సును వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న విద్యార్థులకు ఏ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. దూబచర్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు గుణ్ణంపల్లిలో విద్యార్థులను ఎక్కించుకుని బుట్టాయిగూడెం వైపు వెళుతోంది. అదే సమయంలో ఒడిశా నుంచి ఫర్నిచర్ లోడుతో విజయవాడ వెళుతున్న లారీ ఘటనా స్థలం వద్ద స్కూల్ బస్సును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోగా, లారీ ముందు భాగం దెబ్బతింది. ఆ సమయంలో బస్సులో ఉన్న 30 మంది పిల్లలు ఉండగా, వీరు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏడుస్తూ రోడ్డుపైకి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.

మహిళా సంక్షేమానికి జగన్ ప్రాధాన్యం

- సీఎం జగన్, చంద్రబాబుల మధ్య తేడాను ప్రజలు గమనించాలి
- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మంత్రి కారుమూరి


తణుకులో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సంక్షేమ పథకాలు కేటాయింపులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ వారి ఆర్థిక వికాసానికి తోడ్పడుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గడపలోనూ సంసారాన్ని చక్కబెట్టడంలో మహిళ పాత్ర కీలకమని, అది గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి లబ్ధిని నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకే జమచేసిన వైనాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష, పేదవర్గాల విద్యకు నాడు– నేడు పేరుతో పాఠశాలల అభివృద్ధి, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. పేద విద్యార్థులకు మంచి విద్యనందిస్తే ఉన్నతస్థాయికి వెళ్లి ఉపాధితో ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి మారిపోతుందనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో విద్యావిప్లవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. వలంటీరు వ్యవస్థ వద్దంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం బోధన వద్దంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ గగ్గోలుపెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఏ సౌకర్యం కల్పిద్దామని అడ్డంకులు సృష్టించే పనిలో వారున్నారని ఎద్దేవా చేశారు. రెండు కండువాలతో ఇంటి గుమ్మాల్లోకి వస్తున్నారని ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని కోరారు.

మహిళలను ఆర్థికంగా నిలబెట్టిన వైఎస్సార్ ఆసరా

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసిన నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మాఫీ సొమ్మును నాలుగు విడతల్లో వారి బ్యాంకు ఖాతాల్లో వేయడం అక్కచెల్లెమ్మలపై ఆయనకున్న గౌరవానికి నిదర్శనమని అన్నారు. ప్రజలంతా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎవరు మెరుగుపరుస్తున్నారో గమనించి వారినే ఎన్నుకోవాలని అన్నారు. రాష్ట్రంలో చిన్నతరహా పరిశ్రమలు అధిక సంఖ్యలో వచ్చాయని, పరిశ్రమలకు, రైతాంగానికి కోతలు లేని మంచి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. తణుకు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా నిలబడే నేత మంత్రి కారుమూరి ఒక్కరే అన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

సమాజంలో మహిళల గౌరవాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. నవరత్నాల పేరుతో అందుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల బ్యాంకు ఖాతాలకే జమచేస్తూ మహిళలకు ఎంతో ప్రాధాన్యనిచ్చారని స్పష్టం చేశారు. సాధారణమైన వ్యక్తి అయిన నన్ను నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం ఒక మహిళగాను, బీసీగాను ఆయన నాకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. మన పెద్దలు వివాహ సమయంలో ఆడబిడ్డకు స్త్రీధనం పేరుతో కొంత మొత్తాన్ని కట్టబెడుతుంటారని, కానీ నేటి రోజుల్లో ప్రతి ఆడబిడ్డకు సొంత అన్నలా సీఎం జగన్ పథకాల పేరుతో అండగా నిలబడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా సభావేదికపై మంత్రి కారుమూరి జ్యోతిప్రజ్వలన చేసి వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభా ప్రాంగణం ప్రాంతంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, డీజే అమూల్యారావు, పిల్లి సూరిబాబు, తాటిపర్తి వాసు, కుడుపూడి చంద్రరావు, సామంతుల అప్పారావు, ఝాన్సీ లారెన్స్, గీత, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

తణుకు టౌన్: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పారదర్శకంగా, దళారుల్లేకుండా నేరుగా అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆత్మ గౌవరాన్ని పెంచేలా, వారు గడప దాటకుండానే సంక్షేమ పథకాలన్నీ ఇంటి గడప వద్దకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నామని చెప్పారు. ఒక్క ముద్దాపురం గ్రామంలోనే గత టీడీపీ హయాంలో రూ. 5 కోట్ల 80 లక్షల విలువైన సంక్షేమ, అభివృద్ధి పనులు చేయగా గత నాలుగేళ్లలో వైఎస్సాసీపీ ప్రభుత్వం రూ. 30 కోట్ల 54 లక్షల 55 వేల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు పాలనలో గ్రామాలను పట్టించుకోలేదన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి అవసరం తీర్చే విధంగా గ్రామంలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం బోధన వద్దన్నా ముఖ్యమంత్రి జగన్ మాత్రం పేదల పిల్లలకు ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ పాలనలో పథకాలన్నీ జన్మభూమి కమిటీల ద్వారా దోచుకో, దాచుకో మాదిరిగా ఉండేవని, ఇప్పుడు అన్ని పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి గడపవద్దకే అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ కె కృష్ణవేణి, ఎంపీడీవో డీ శ్రీలలిత, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు టీఎస్‌సత్యనారాయణ, నాయకులు ముళ్లపూడి బాబూరావు, ముళ్లపూడి సుబ్బారావు,లతో పాటు దువ్వ, కోనాల గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముద్దాపురంలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

బడుగుల నిజమైన గొడుగు సీఎం జగన్


అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సీసెల్ నాయకులు

అత్తిలి: బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు రాజ్యాధికారంలో 68శాతం పదవులు కేటాయించిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ అత్తిలి మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు అన్నారు. శనివారం అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ ఆర్థిక స్థితిమంతులకు సైతం అరుదుగా లభించే దేశ అత్యున్నతమైన రాజ్యసభ స్థానాన్ని ఒక సామాన్య దళితనేత పాయకారావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు కేటాయించడం గర్వించదగ్గ విషయమన్నారు. విజయవాడ నగరంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యావత్తు దళితజాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకులు రాయుడు ధర్మారావు, కంకిపాటి రత్నరాజు, పొన్నమల్లి సంపదరావు, సబ్బితి రాజేష్, ఈడూరి శ్యాంబాబు, బుంగా పద్మారావు, యార్లగడ్డ సాగర్, యాళ్ల సాధు సుందర్‌సింగ్, వూడిమూడి ప్రసాద్, యాళ్లస్వామి, ఇల్లూరి సంపతరావు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన ఎంపీ అభ్యర్థి ఉమాబాల

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేశారు. సామాన్యురాలినైన తనను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఆమె అన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ మహిళలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి, ఇరగవరం మండలాల మహిళాధ్యక్షులు కాకర్ల విశాలాక్షి, మెట్ల కిరణ్మయి, పార్టీ మహిళలు షేక్ బాజీ, బొంతు యశోధ, పంపన శ్రీదేవి పాల్గొన్నారు.


తణుకులో మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల

పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయం

తణుకు అర్బన్: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న గౌరవాన్ని ఇవ్వడం తెలుగు జాతికి ఎంతో గర్వకారణమని అఖిలభారత బ్రాహ్మణ యువత ఉపాధ్యక్షుడు, న్యాయవాది సూరంపూడి కామేష్ అన్నారు. శనివారం ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తణుకులో నిర్వహించిన కార్యక్రమంలో నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ భారత ఆర్థికవ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన అపరచాణక్యుడు పీవీ అని కొనియాడారు. అటువంటి మహనీయుడికి భారతరత్న అందించిన కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి పురుషోత్తమాచార్యులు, కలగ సుబ్రహ్మణ్యం, ఖండవల్లి సీతారామాచార్యులు, ఎన్.శ్రీనివాస్, ఖండవల్లి రామాచార్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం ఆనందదాయకమని పాతూరు నాయకులు దాట్ల జగన్నాథరాజు, నిమ్మకాయల యాత్ కర్రి సత్యనారాయణ, నీలం సురేష్, నాయకులు మారిశెట్టి సుబ్బారావు, మెరుగు రాజగోపాల్, తదితరులు హర్షం ప్రకటించారు.


పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కామేష్, తదితరులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: తల్లిదండ్రులు తమ చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ సిబ్బంది మల్లేశ్వరి చెప్పారు. శనివారం అత్తిలి మండలం బల్లిపాడు శివారు గుమ్మంపాడు గ్రామంలో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమంపై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని కోరారు. ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లలను ఎదగనిద్దాం– ఆడపిల్లలను చదవనిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి నర్సవేణి, ఎం సత్యవతి, బి నిర్మలకుమారి, సిహెచ్ రామలలిత, ఉపాధ్యాయిని ఆకుల పద్మ పాల్గొన్నారు.


గుమ్మంపాడులో బేటి బచావో–బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

12న మున్సిపల్ స్పోర్ట్స్ అరీనా ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ మున్సిపల్ స్పోర్ట్స్ అరీనా ఇండోర్ స్టేడియంను ఈ నెల 12వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభిస్తారని కమిషనర్ ఎ. శామ్యూల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి సీహెచ్ చెన్నయ్య, డాక్టర్ పి.శోభారాణి, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ పి.విజయవర్మ, ఓ.పీ.గోయంక, సంధ్యాల కృష్ణమూర్తి, జీ.ఆర్.రెడ్డి, డాక్టర్ కొండ్రెడ్డి శశికుమార్‌లు హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


కార్యక్రమానికి హాజరైన ఏపీ నిట్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జీవితంలో చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి లోను కాకుండా విద్యార్థులు ఇష్టపడి చదివితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వ్యక్తిత్వ వికాసనిపుణుడు సాయివంశీ చెప్పారు. ఏపీ నిట్‌లో శనివారం మెంటల్‌హెల్త్ కార్యక్రమం జరిగింది. ఆధునిక జీవన విధానంలో ఎదురయ్యే సమస్యలకు ఎక్కువగా ఆలోచిస్తూ తీవ్ర ఒత్తిడికి, మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోడానికి నిత్యం, ధ్యానం,యోగా, వ్యాయామం వంటివి చేయాలన్నారు. సమస్యలను ధీటుగా ఎదుర్కొని ముందడుగు వేస్తే ఎలాంటి ఒత్తిడి దరిచేరదన్నారు. మనసులోకి చెడు ఆలోచనలు రానీయకుండా మ్యూజిక్ వినడం వంటివి చేయడం ద్వారా సమస్యలను అధిగమించవచ్చన్నారు. మన ఆరోగ్యాన్ని మనమే ప్రతి క్షణం కాపాడుకోవాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వీరేష్‌కుమార్, వైద్యాధికారి ధర్మతేజ, ఆచార్యులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో 27 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని వెల్లడించారు. భారీ అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, అప్పడా వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ నాయుడు, పట్టణ ప్రముఖులు హాజరవుతారని, అమ్మవారిని, స్వామివారిని దర్శించి తరించాలని కోరారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు విశేష పూజలు


విశేష అలంకారణలో ముత్యాలమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు, పూల అలంకరణ చేశారు. అనంతరం పలువురు మహిళలు లలిత సహస్ర నామ పారాయణ, కోలాట నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శశిలో ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ


సమావేశంలో మాట్లాడుతున్న ఐజీఎస్ ప్రెసిడెంటు అనిల్ జోసెఫ్

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీని శనివారం ప్రారంభించారు. ఐజీఎస్ ప్రెసిడెంటు అనిల్ జోసెఫ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జయప్రకాష్ వేమూరి, కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్, సంస్థ అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మేకా నరేంద్రకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన బ్యాంకు ఉద్యోగాలు భర్తీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ సూర్యనారాయణ

తాడేపల్లిగూడెం: శాశ్వత ప్రాతిపదికన బ్యాంకు ఉద్యోగాలు భర్తీ చేయాలని శనివారం పట్టణంలోని షిర్డీ సాయి కల్యాణ మండపంలో జరిగిన ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగుల సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరు, కార్యాచరణ గురించి సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ జనరల్ సెక్రటరీ టీవీ.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు సీపీ.చంద్రశేఖరన్, ఎం.రత్నాకర్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, లీలా శ్రీనివాసు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మురుగుకు మోక్షం


డ్రైయిన్ కోసం ప్రొక్లెయిన్‌తో తవ్వుతున్న చిత్రం

తాడేపల్లిగూడెం: దీర్ఘకాల మురుగు సమస్యకు మున్సిపల్ అధికారులు శనివారం మోక్షం కలిగించారు. రెండో ఫ్లైవోవర్ వంతెన రోడ్డులో బాలకనకదుర్గమ్మ గుడి ఎదురుగా గోగులమ్మ గుడి రోడ్డులో డ్రెయినేజీ అనుసంధానం జరగకపోవడం వల్ల మురుగునీరు సక్రమంగా పారే అవకాశం లేకుండా పోయింది. సుమారు తొమ్మిది సంవత్సరాలుగా ఈ సమస్య ఉన్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కమిషనర్ అనపర్తి శామ్యూల్, సహాయక కమిషనర్ ఎం.గోపాలరావుల పర్యవేక్షణలో ఈ సమస్య శనివారం పరిష్కారమైంది.

నేడు ఘంటసాల సంగీత విభావరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల గాన సభ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక వీకర్స్‌కాలనీలోని సాయంత్రం 6.30 గంటలకు బీవీఆర్ కళాకేంద్రంలో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు గానసభ అధ్యక్షుడు ఎస్.ఖాసిం సాహెబ్ తెలిపారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీసీ బహిరంగ సభను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీసీ హక్కుల సాధనకై రాష్ట్ర వ్యాప్త బీసీ బహిరంగ సభను ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి తాడేపల్లిగూడెంలోని నల్లజర్ల రోడ్డులో పెదతాడేపల్లి హైవే ప్రక్కన నిర్వహిస్తున్నట్లు బీసీ చైతన్యవేదిక ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు, బీసీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని వెల్లడించారు. బీసీ సబ్‌ప్లాన్, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు తదితర విషయాలపై చర్చిస్తారన్నారు. నాయకులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.